## క్లుప్తంగా

### ఘనంగా కలాం జయంతి



నర్సంపేట : పట్టణంలోని లీడ్ గ్రంథాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. కలాం చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, గ్రంథాలయ ఉద్యమకర్త కాసుల రవికుమార్ మాట్లాడారు. శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం యువతకు ప్రేరణ అందించారని తెలి పారు. పేపర్ బాయ్ నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన కలాం జీవిత చరిత్ర విద్యార్థులకు ఆదర్శమన్నారు. గ్రంథాలయం ప్రధాన నిర్వాహకురాలు శోభారాణి మాట్లాడుతూ చదువుల మార్గంలో ముందుకు సాగాలన్నారు.

**జాగృతి విద్యానికేతన్‌లో..**

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండల కేంద్రంలోని జాగృతి విద్యానికేతన్ స్కూల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు గోదాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీడీఓ బదిలీ

నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట ఎంపీడీఓ నల్ల శ్రీవాణి డీఆర్‌డీఓ కార్యాలయానికి ఏపీడీగా బదిలీ అయ్యారు. ఈ క్రమంలో చెన్నారావుపేట ఎంపీడీఓగా ఇటీవల గ్రూప్స్‌లో ఎంపికైన సిరికొండ వెంకట శివానంద్ నియమితులయ్యారు. రెండు వారాల శిక్షణ అనంతరం ఆయన విధుల్లో చేరనున్నారు.

### గ్లోబల్ హ్యాండ్ వాష్ డే



నర్సంపేట రూరల్ : చెన్నారావుపేట మండలంలోని బోజేర్వు ప్రభుత్వ స్కూల్‌లో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే నిర్వహించారు. విద్యార్థులకు చేతులను శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎర్ర రవీందర్ మాట్లాడారు. కంటికి కనపడని క్రిములు చేతులపై ఉంటాయన్నారు. చేతులను శుభ్రం చేసుకోవడాన్ని విద్యార్థి దశలోనే అలవర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వర్, రమేశ్, రాజు, శ్వేతశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు

గీసుకొండ : జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్ పథకం కింద మండలంలోని రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలు అందిస్తామని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) హరిప్రసాద్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి మొత్తం 14 క్వింటాళ్ల ఎన్ఎస్‌సీ సీటీ 4260 హైబ్రిడ్ రకం మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్సులతోపాటు ఫోన్ నంబర్ ఏఈఓకు అందజేయాలని సూచించారు. నాలుగు కిలోల మొక్కజొన్న విత్తనాల ప్యాకెట్ సబ్సిడీపై రూ.980లకు లభిస్తుందని, ఎకరానికి రెండు ప్యాకెట్ల చొప్పున వేయాలని తెలిపారు.

### ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



రాయపర్తి : వ్యాపారస్తులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి వల్లె వినోద్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పలువురు దుకాణాదారులకు బుధవారం ఆయన గ్రామ పంచాయతీ నుంచి ట్రేడ్ లైసెన్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కారోబార్ కారుపోతుల మల్లయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### రేపటి నుంచి స్పోర్ట్స్ మీట్

వర్ధన్నపేట/రాయపర్తి : పట్టణంలోని క్రీడా ప్రాంగణంలో రేపటి (ఈనెల 17వ తేదీ) నుంచి రెండ్రోజులపాటు మేరా యువ భారత్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట, రాయపర్తి మండలాల బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు బ్లాక్ కోఆర్డినేటర్ నవీన్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఏ' గ్రూప్ ఈవెంట్‌లో పురుషులకు కబడ్డీ (ఏడుగురు సభ్యులు), మహిళలకు టగ్ ఆఫ్ వార్/తాడు గుంజు ఆట (8మంది సభ్యులు), వ్యక్తిగత ఈవెంట్లలో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్ (100 మీటర్ల పరుగు పందెం) ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పురుషులు, మహిళలకు బ్యాడ్మింటన్ (షటిల్ సింగిల్స్) ఉంటాయని వివరించారు. రెండు మండలాల యువత పోటీలను వినియోగించుకోవాలని కోరారు.

# కాజ్‌వేపై ప్రయాణ కష్టాలు

- వరదొస్తే రాకపోకలు బంద్



లోలెవల్ కాజ్‌వేపై ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

ఖానాపురం : మండలంలోని నాజీతండాకు వెళ్లే దారిలోని వాగుపై సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన లోలెవల్ కాజ్‌వేపై ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. వరద నీటి ప్రవాహం పెరిగితే రాకపోకలు నిలిచిపోవడం ఖాయం. అత్యవసర పరిస్థితుల్లో వాగు దాటే సాహసం చేస్తే ప్రమాదాలకు గురి అవుతున్నారు. కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మిస్తేనే శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఆ దిశగా అధికారులు ప్రభుత్వానికి రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో ఇటీవల నివేదిక ఇవ్వడంతో ప్రజలు బ్రిడ్జి నిర్మాణానికి ఆశగా ఎదురు చూస్తున్నారు.

మండలంలోని నాజీతండాకు వెళ్లే దారిలోని వాగుపై ఉన్న లోలెవల్ కాజ్‌వే మీదుగా నాజీతండా, కొత్తగూడ, గంగారం మండలాలకు చెందిన ప్రజలు విద్య, వైద్యం, వ్యాపార, ఇతర అవసరాలకు రాకపోకలు సాగిస్తారు. అశోక్‌నగర్ శివారులోని పాకాల వాగు, చిలుకమ్మనగర్ శివారులోని గాదె వాగు ఉధృతంగా ప్రవహిస్తే నాజీతండా దారి మీదుగా ప్రయాణం చేస్తారు. భారీ వర్షాలు కురిస్తే నాజీతండా శివారులోని వాగుపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వే మీద వరద నీటి ఉధృతికి ప్రయాణాలు నిలిచిపోతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సాహసం చేసి వాహనదార్లు కొట్టుకుపోయిన ఘటనలున్నాయి. భారీ వర్షాలతో ఆగస్టు నెలలో కొత్తగూడ మండలానికి చెందిన ఇద్దరు వాహనదారులు వాహనాలతోసహా వాగులో కొట్టుకుపోగా పోలీసులు, స్థానికులు కాపాడారు. మరుసటి రోజు వారికి పోలీసులు వాగులో కొట్టుకుపోయిన వాహనాలను వెతికి అప్పగించారు. ఇలాంటి ఘటనలు గుర్తుకొస్తే జనం బెంబేలెత్తుతున్నారు. ఇదిలా ఉండగా కాజ్‌వేపై పడిన గుంతలతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

**బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు**

కొత్తగూడ, గంగారం, నాజీతండా ప్రజలు భారీ వర్షాలకు వాగు ఉధృతి చోటు చేసుకుంటే భూపతిపేట మీదుగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ క్రమంలో సుమారు నెల రోజుల క్రితం సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించే దిశగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు రూ.2.50 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. బ్రిడ్జి నిర్మింపజేసేందుకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ తీసుకుంటున్నట్లు ప్రచారంలో ఉంది. కాజ్‌వేపై మరమ్మతులకు సైతం రూ.1.50 లక్షలతో నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అధికారులు అందజేశారు. బ్రిడ్జి నిర్మిస్తే రవాణా కష్టాలు తొలగిపోయే అవకాశం ఉంది.

**బ్రిడ్జి నిర్మించాలి**

నాజీతండా శివారులోని వాగుపై బ్రిడ్జి నిర్మించాలిసిందే. లోలెవల్ కాజ్‌వే నిర్మించి సుమారు రెండు దశాబ్దాలు గడిచింది. వరద నీటి ఉధృతి సమయంలో చెత్తతోపాటు చెట్ల కొమ్మలు తట్టుకుని వరదనీటి ప్రవాహం కష్టంగా మారుతోంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి లోలెవల్ కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మింపజేయాలి.

– బి.బాలకిషన్, మాజీ సర్పంచ్, నాజీతండా

**నివేదికలు పంపాం**

లోలెవల్ కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణంతోపాటు రోడ్డు మరమ్మతు కోసం ప్రభుత్వానికి, కలెక్టర్‌కు నివేదిక అందించాము. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి చొరవ తీసుకుంటున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే టెండర్, ఇతర ప్రక్రియ పూర్తి చేసి లోలెవల్ కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుడతాం.

– మణితేజరెడ్డి, ఏఈ, పీఆర్

## వ్యక్తిగత, పరిసరాల శుభ్రత కీలకం

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

నర్సంపేట : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత కీలకమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ సూచించారు. ఆ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పరిసరాలతోపాటు తరగతి గదులను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. శుభ్రతపై విద్యార్థులు గ్రామాల్లో చైతన్యం కలిగించాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ జిల్లా బాధ్యుడు డాక్టర్ రాంబాబు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు, తరగతి గదులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ బాధ్యుడు డాక్టర్ రాజీరు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంధ్య, అకాడమీ కోఆర్డినేటర్ కందాల సత్యనారాయణ, పరీక్షల నియంత్రణాధికారి కమలాకర్, అధ్యాపకులు సోమయ్య, ఎస్.రజిత, రుద్రాణి, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

## బాలికల హక్కులు సామాజిక బాధ్యత

- జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

పర్వతగిరి : బాలికల హక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి అభివర్ణించారు. మండలంలోని ఏనుగల్ జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ బాలికా దినోత్సవానికి రమాదేవి హాజరై మాట్లాడారు. పోషణ, చట్టపరమైన హక్కులు, రక్షణ, హింస నివారణ, బలవంతపు బాల్య వివాహాలు, తదితరాలపై అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 100, 1930, 14567 గురించి వివరించారు. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. అనంతరం విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో డీహెచ్ఈడబ్ల్యూ జీఎస్.రమాదేవి, ఏడబ్ల్యూటీ అరుణ, హెచ్‌ఎం లింగారెడ్డి, ఉపాధ్యాయులు ఆనంద్‌కుమార్, మజహార్ మోహిరుద్దీన్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- మోటివేషనల్ స్పీకర్ దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

నర్సంపేట : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో లక్ష్యసాధనలో ముందుకు సాగాలని మోటివేషనల్ స్పీకర్, సైకాలజిస్ట్ కజాంపురం దామోదర్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హన్మకొండ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'సామాజిక సంస్కార విద్యా వికాస ప్రేరణ' కార్యక్రమంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇంటర్ కీలకమన్నారు. ఉద్వేగాలతో సాగే దశలో ఆలోచనలను ఉన్నత స్థితి వైపు మరల్చాలని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థులు సన్మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సువర్ణ, మహిళా సంఘ ప్రతినిధి గుర్రం అరుణ, నర్సంపేట వినియోగదారుల మండలి ప్రతినిధులు పెరుమాండ్ల కుమార్‌రెడ్డి, పెండ్యాల సురేందర్, లెక్చరర్లు సోమనారాయణ, మణిపాల్‌రెడ్డి, చంద్రకళ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

### ఎంపిక పోటీల్లో పాల్గొనాలి

నర్సంపేట : విద్యార్థులు క్రీడా ఎంపిక పోటీల్లో పాల్గొనాలని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సారంగపాణి కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. వరంగల్‌లోని ఓసిటీ స్టేడియంలో ఈనెల 17న అండర్–14, 17 బాలబాలికల సాఫ్ట్‌బాల్, 18న అండర్–14, 17 విభాగాల బాలబాలికల బేస్ బాల్, యోగాసనాలు 14, 17 ఏళ్ల బాలబాలికలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. 18వ తేదీన హ్యాండ్‌బాల్ బాలల ఎంపికలు పైడిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 8.30 గంటలకు నిర్వహిస్తారని చెప్పారు.

### సరుకుల పంపిణీ

రాయపర్తి : మండలంలోని సన్నూరు వెంకటేశ్వరపల్లిలో పలువురు పేద మహిళలకు లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణీ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా తరుణి అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవిరెడ్డి మాట్లాడారు. సుమారు రూ.9 వేల విలువైన బియ్యం, సరుకులతోపాటు చీరెలు అందజేసినట్లు తెలిపారు.

### పరామర్శ

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన అనుపర్తి యాకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం పరామర్శించారు. తొలుత యాకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. బియ్యం, వంట సామగ్రి సాయంగా అందచేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సమ్మెట సుధీర్, తుమ్మల రవీందర్, బిజ్జం పాపారావు, సిలువేరు శ్రీధర్, పులి శ్రీనివాస్, అన్వర్, వెంకట్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

**తిర్మలాయపల్లిలో..**

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన ముద్రబోయిన రామనర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గ్రామానికి చెందిన కసరబోయిన రాజు బుధవారం పరామర్శించారు. అనంతరం 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ సాయంగా అందజేశారు. కార్యక్రమంలో చిక్కుడు శ్రీనివాస్, దొంతరబోయిన రాజయ్య, ముద్రబోయిన ఉప్పలయ్య, ముద్రబోయిన రమేశ్, అన్నెపు వెంకన్న, వశపాక ప్రశాంత్, సంకరబోయిన మొగిలి తదితరులు పాల్గొన్నారు.

### 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయండి



దుగ్గొండి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గిర్నిబావిలో వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. రిజర్వేషన్‌కు అడ్డుపడుతున్న అగ్రకులాలకు గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి సురేశ్, మండల అధ్యక్షుడు పొన్నాల మహిపాల్, నాయకులు డ్యాగం శివాజి, బండారి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

### బీసీ సంఘాలు ఐక్యత చాటాలి

నర్సంపేట : రిజర్వేషన్ సాధన కోసం బీసీ సంఘాలు ఐక్యత చాటాలని బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వంగ రవి కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. ఈనెల 18న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ దుగ్గొండి మండల అధ్యక్షుడు కడారి రాజు, నాయకులు రామగిరి వీరేందర్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

### దిష్టిబొమ్మ దహనం

వర్ధన్నపేట/గీసుకొండ : వర్ధన్నపేట, గీసుకొండ మండలాల్లో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేటలో ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి మంద రవి, గీసుకొండలో కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి మాట్లాడారు. సామాజిక, లింగ వివక్షతకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు జాయింట్ కోఆర్డినేషన్ కమిటీ నిర్ణయం మేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దేశంలో ఫాసిస్టు మనువాదం వల్లే సామాజిక అణచివేత తీవ్రతరం అవుతోందని చెప్పారు. కార్యక్రమాల్లో నాయకులు కొట్టూరి కరుణాకర్, ఉడుత గణేశ్, అమరావతి యాదగిరి, మంద బాబు, ఉడుత అశోక్, పులిచేరి సుధాకర్, సారయ్య, మల్లయ్య, రాజమౌళి, ఖలీల్, రంజిత్, మల్లేశం, లలిత, యమున, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి : మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి పి.అపర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థుల్లో మెరిట్ జాబితాలో పేరు ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లతో ఈనెల 19న సాయంత్రం 4 గంటలలోపు స్థానిక గురుకుల స్కూల్/కళాశాలలో సంప్రదించాలని కోరారు.

### రేపు మాజీ ఎమ్మెల్యే ఓంకార్ వర్ధంతి సభ

దుగ్గొండి/సంగెం : రేపు (ఈనెల 17న) నర్సంపేటలోని ఎంసీపీఐ(యూ) కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ 17వ వర్ధంతి సభ నిర్వహిస్తామని ఆ పార్టీ నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా సాహెబ్, సంగెం మండల కార్యదర్శి ఇస్మాయిల్ తెలిపారు. ఆయా మండలాల్లో బుధవారం వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. ఓంకార్ తెలంగాణ రైతాంగ సాయుధ రైతాంగ పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని, నర్సంపేట ఎమ్మెల్యేగా 5 సార్లు గెలిచి ప్రజలకు ఎనలేని సేవలు అందించారని వివరించారు. నిఖార్సైన కమ్యూనిస్టుగా ప్రజాచైతన్యానికి పాటుపడ్డారని కొనియాడారు. ప్రజాసమస్యలపై అసెంబ్లీలో గళమెత్తి రాష్ట్ర చరిత్రలో తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. ఓంకార్ వర్ధంతిని పురస్కరించుకుని అవినీతి, నేరమయ, ధర రాజకీయాలకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహిస్తామన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## టీకాతో 'గాలికుంటు' నివారణ

- మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి



నెక్కొండ : పశువుకు టీకా వేస్తున్న వైద్యురాలు

నెక్కొండ/దుగ్గొండి/వర్ధన్నపేట/రాయపర్తి/పర్వతగిరి/సంగెం : పశువుల్లో గాలికుంటు వ్యాధిని టీకా ద్వారా నివారించొచ్చని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని నెక్కొండ, దుగ్గొండి, వర్ధన్నపట, రాయపర్తి, పర్వతగిరి, సంగెం మండలాల్లో బుధవారం పశు వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెక్కొండలో హరీశ్‌రెడ్డి, ఆయా మండలాల్లో పశు వైద్యాధికారులు మమత, సోమశేఖర్, రాజేందర్, శృతి, రాజేశ్, వల్లె రాజు మాట్లాడారు. నెల రోజుల పాటు వైద్యశిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. పాడి రైతులు పశువులకు టీకాలు వేయించి గాలికుంటు వ్యాధి బారి నుంచి కాపాడుకోవాలని సూచించారు. గాలికుంటు వ్యాధి బారిన పడిన పశువుల్లో కనిపించే లక్షణాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు వివరించారు.

## రిజర్వేషన్ల సాధనకు పోరాటం తప్పదు



నర్సంపేట : పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద రాస్తారోకో చేస్తున్న నాయకులు

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రమేశ్

నర్సంపేట : బీసీ రిజర్వేషన్ సాధనకు పోరాటం తప్పదని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేశ్ తెలిపారు. బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో ఆమోదించినా పంపగా కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక వైఖరి అవలంభిస్తోందన్నారు. ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కుమారస్వామి, అక్కపెల్లి రమేశ్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు గుంపెల్లి మునీశ్వర్, అయిత యాకయ్య, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత, నాయకులు పిట్టల సతీశ్, గడ్డం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

**దశాబ్దాలుగా మోసం**

వర్ధన్నపేట : బీసీలను దశాబ్దాలుగా పాలకులు మోసం చేస్తున్నారని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పనాస ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై నిర్వహించిన రాస్తారోకోలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభాలో 56 శాతానికిపైగా ఉన్న బీసీలకు కేవలం 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ల్యాదెల్ల శరత్, బొట్ల శ్రీనివాస్, ఆరెల్లి ప్రభాకర్, బొడ్డుపెల్లి సాయిలు, లొంక అయిలయ్య, చెక్క గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో చట్టం చేయాలి

- టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రతిపాదించిన క్రమంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టం చేసి బీసీ బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో అన్ని పార్టీలు అసెంబ్లీలో తీర్మానానికి మద్దతిచ్చినా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి నిరాకరిస్తోందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని చెప్పారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు సమితి మద్దతిస్తోందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, నాయకులు గుంటి రాంచందర్, బొనగాని రవీందర్, ఎలిశాల రాజేశ్, సాంబరాతి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ విద్యా విధానమే మేలు

- సంఘం జాతీయ నాయకుడు సాంబయ్య

నర్సంపేట : శాస్త్రీయ విద్యా విధానమే మేలని రైతు సంఘం జాతీయ నాయకుడు సింగతి సాంబయ్య తెలిపారు. పట్టణంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు బుధవారం నిర్వహించారు. తొలుత స్థానిక అమరవీరుల స్తూపం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమ్మెట హర్షన్ అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో సాంబయ్య ప్రసంగించారు. అంబానీ, ఆదానీల వంటి సంపన్నులకు దేశ సంపదను దోచిపెట్టడానికే కేంద్ర ప్రభుత్వం అడవుల్లో నివసిస్తున్న గిరిజనులపై మావోయిస్టుల పేరుతో హింసకు పాల్పడుతోందని విమర్శించారు. శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలని సూచించారు. యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయకుండా పేద విద్యార్థులను చదువులకు దూరం చేస్తోందన్నారు. సభలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి, నాయకులు స్నేహ, రమ్య, సాత్విక్, రమేశ్, రవి, వెంకటేశ్, మహేశ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

### బాకీ కార్డుల పంపిణీ

సంగెం : బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని బాలునాయక్‌తండా, నల్లబెల్లి, ముమ్మిడివరం, మొండ్రాయి, పల్లారుగూడ, వీఆర్ఎన్ తండా, కృష్ణానగర్, చింతలపల్లి, సంగెం గ్రామాల్లో ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల్లో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వలేదని చెప్పారు. రైతులు కరెంటు, యూరియా కోసం ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పెన్షన్ పెంచలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, కుమారస్వామి, మల్లయ్య, సాగర్‌రెడ్డి, బాలకృష్ణ, గోవర్ధన్, రాజు, వీరేశం, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు అండగా 'సఖి'

గీసుకొండ : మహిళలకు సఖి కేంద్రాలు అండగా ఉంటాయని కేస్ వర్కర్ తిరుమల తెలిపారు. మండలంలోని చంద్రయ్యపల్లి, విశ్వనాధపురం గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులకు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు, బాలికల హక్కుల పరిరక్షణ కోసం సఖి కేంద్రం కృషి చేస్తోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు 181, ఆపదలో ఉన్న బాలికలు 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సాయం పొందాలని సూచించారు. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు. మహిళలు చైతన్యవంతం కావాలని ఆకాంక్షించారు. సఖి కేంద్రాల్లో లభించే సేవల వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెర్ప్ సీసీ శ్రీలత, వీఓఏ జ్యోతి, శివకుమార్, చామంతి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని కల్వర్టు వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. నర్సంపేట నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఇన్నోవా కారు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ప్రయాణిస్తున్న ధర్మారావుపేటకు చెందిన ప్రవీణ్, శివ గాయాల పాలయ్యారు. వారిని స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఎస్సై గూడ అరుణ్ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.